క్లుప్తంగా

మాయమవుతున్న రేకులు


అపహరణకు గురైన రేకులు

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చేరుకునే దారిలోని చెత్త సంపద కేంద్రానికి చెందిన రేకులు మాయమవుతున్నాయి. గ్రామంలో తడి,పొడి చెత్తను సేకరించి ఇక్కడ డంప్ చేసేందుకు దాదాపు తొమ్మిదేళ్ల క్రితం కొండపై సంపద కేంద్రాన్ని నిర్మించారు. మొదటి నుంచి వాటిని ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం కంపచెట్లు పెరిగి అస్తవ్యస్థంగా మారింది. వాడుకలో లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇప్పటికే ఎనిమిది రేకులు మేర తీసుకెళ్లిపోయారు. అధికారులు చర్యలు చేపట్టకపోతే మొత్తం రేకులన్నీ మాయమయ్యే ప్రమాదముందని స్థానికులు పేర్కొన్నారు.

క్రాకర్స్ ధరల కట్టడికి వినతి


అధికారులకు విన్నవిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల: దీపావళి పండుగను ఆసరాగా చేసుకుని టపాకాయల దుకాణ యజమానులు ఆర్థిక దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. దుకాణ యజమానులు కుమ్మక్కై అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉందన్నారు. ధరలను కట్టడి చేయాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు


పోచా నగర్‌లో నీటి కుంటలను పరిశీలిస్తున్న కమిషనర్

డోన్: పట్టణంలో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభాకర్‌రెడ్డి నగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లోని ఖాళీస్థలాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలను ఉంచిన యజమానులు ఇకపై పన్ను చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షపు నీరు నిల్వ ఉన్న కుంటల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నియంత్రణకు ప్రయత్నిస్తున్నామన్నారు. పట్టణ వ్యాప్తంగా అన్ని వీధుల్లో ఫాగింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ


నరసింహులుకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

డోన్ టౌన్: డోన్ ఆర్డీఓగా కేపీ నరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న మహేశ్వరరెడ్డిని ప్రిన్సిపల్ సెక్రటరీకి రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతిలో స్పెషల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పాత ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, డోన్ తహసీల్దార్ నాగమణి, సర్వేయర్ జగదీష్‌కుమార్, వీఆర్వోలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రెవెన్యూ, భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ఆర్డీఓ తెలిపారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు


సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

అవుకు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. పిక్కిళ్లపల్లితండా, కొండమనాయుని పల్లె, మారెమడుగుల గ్రామాల్లో 7 సారా తయారీ బట్టీలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. 9వేల లీటర్ల బెల్లం ఊటను పారబోశామన్నారు. సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం

- పిచ్చి మొక్కలకు నిలయంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.64 లక్షలతో ఆధునికీకరణ
- రూ. 40 లక్షలతో పార్కు, జిమ్, పిల్లలు ఆడుకునే పరికరాలు
- ప్రస్తుతం నిరుపయోగంగా మారిన పార్కు


నాడు..పచ్చదనంతో సుందరంగా దర్శనమిస్తున్న పార్కు


నేడు..నిర్వహణ లేకపోవడంతో ఏపుగా పెరిగిన గడ్డి

ప్యాపిలి: గత వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి పనుల కోసం అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వెచ్చించిన కోట్లాది రూపాయల ప్రజాధనం ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యానికి బూడిదలో పోసిన పన్నీరులా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో పాటు పూర్తయిన పనులపై ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ఈ ప్రాంగణం అసాంఘిక చర్యలకు నిలయంగా మారింది. దీన్ని గమనించిన అప్పటి ఆర్థిక శాఖ మంత్రి రూ.64 లక్షలతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని ఆధునీకరించారు. రూ. 40 లక్షలతో అతిథి గృహ ప్రాంగణాన్ని పచ్చని గడ్డితో, పూల చెట్లతో పార్కును ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం చిన్న పిల్లలు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు, పెద్దలు వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్ జిమ్ అందుబాటులో ఉంచారు. వాకింగ్ కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. అతిథి గృహాన్ని, పార్కును ఈ ఏడాది జనవరి 3వ తేదీ మంత్రి హోదాలో బుగ్గన ప్రారంభించారు. అప్పటి నుంచి పార్కుకు సాయంత్రం వేళలో పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి కాసేపు సేద తీరి వెళ్లేవారు. పిల్లలు క్రీడా పరికరాలతో ఆడుకుని ఆహ్లాదంగా గడిపి వెళ్లేవారు. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉన్న పార్కును అందంగా తీర్చిదిద్దడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కూటమి అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం

దాదాపు కోటి రూపాయల ప్రజాధనం వెచ్చించి ప్రజల సౌకర్యార్థం తీర్చిదిద్దిన పార్కును కూటమి ప్రభుత్వం అధికారంలోకి నిర్లక్ష్యం వహిస్తోంది. నాలుగు నెలలుగా ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చేవారి కోసం గేటుకు ఉన్న తాళాలు తీయకపోవడంతో ప్రజలు రావడం మానేశారు. దీంతో అతిథి గృహం ఆవరణలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి విషపురుగులకు నిలయంగా మారాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పార్కుపై ఇలా నిర్లక్ష్యం వహించడం సరికాదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పార్కులో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు

పార్కులో మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. అలాగే పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాల్సిందిగా కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. త్వరలోనే జంగిల్ క్లియరెన్స్ చేసి పార్కును వినియోగంలోకి తీసుకొస్తాం.

–ప్రసాద్‌రెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ


నిరుపయోగంగా మారిన జిమ్ పరికరాలు


ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు


నాడు..ఆడుకుంటున్న పిల్లలు


నేడు..నిరుపయోగంగా మారిన క్రీడా పరికరాలు

నేడు శింగనపల్లెలో గ్రామ సభ

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి తెలిపారు. గ్రామంలో రీసర్వే జరిగినందున ప్రజలకు ఏదైనా భూ సమస్యలు ఉంటే అర్జీలు అందించవచ్చన్నారు. వచ్చిన అర్జీలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న సోమవారం తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే మండల్ మీట్‌కు ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. మండల అధికారులు ఆయా శాఖలకు చెందిన పూర్తి వివరాలతో హాజరుకావాలని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు.

రేపు గంగ పుత్రుల సమావేశం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కోట్లవారి పల్లెలో వెలసిన శ్రీగంగమ్మ గుడి వద్ద బుధవారం ఉదయం 10.30 గంటలకు గంగపుత్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక, గుడి నిర్మాణం, ప్రహరీ గోడల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గంగపుత్రులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి భరద్వాజ జయంతి ఉత్సవాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కొలువైన శ్రీపాలికి వరచిదంబరస్వామి సన్నిధిలో మంగళ, బుధవారాల్లో భరద్వాజ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. మంగళవారం ఉదయం సామూహిక పారాయణం, రాత్రి పాలికి గ్రామస్తులతో అఖండ నామ సంకీర్తన, భజనలు ఉంటాయని పేర్కొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి


మాట్లాడుతున్న ఏపీడీ నరసింహారెడ్డి


హాజరైన ఉపాధి హామీ సిబ్బంది

బేతంచెర్ల: నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పనులు చేపట్టి గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఏపీడీ నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా లేబర్ రిపోర్టు, గోకులాల నిర్మాణం, ఇంకుడు గుంతలు, హౌసింగ్ నిర్మాణాలు 90 రోజులకు సంబంధించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనులు చేయాలని సూచించారు.

విజ్ఞాన ప్రదర్శనలతో సాంకేతిక పరిజ్ఞానం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, అధికారులు

డోన్ టౌన్: సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని.. తిలకించిన విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, గురుకుల విద్యాసంస్థల ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, ఎంఈఓ-2 రామనర్సప్ప అన్నారు. డోన్‌లోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. డీసీఓ శ్రీదేవి మాట్లాడుతూ.. జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన చేసే గురుకుల విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. మొత్తం నాలుగు జిల్లాల నుంచి 300 మంది పాల్గొన్నట్లు చెప్పారు. సైన్స్, ఆర్ట్, సంగీతం, సాంస్కృతిక అంశాలకు సంబంధించి 73 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ఉడుములపాడు సర్పంచ్ ఉప్పరి రాధమ్మ, ప్రిన్సిపాల్ గీత పాల్గొన్నారు.

గ్రంథాలయ పన్ను బకాయిలు చెల్లించండి


మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి బషీర్‌అహ్మద్

బనగానపల్లె రూరల్: గ్రామ పంచాయతీల ద్వారా రావాల్సిన గ్రంథాలయ పన్ను బకాయిలు చెల్లించాలని బనగానపల్లె గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. బషీర్ అహ్మద్ మాట్లాడుతూ.. మండలంలో గత పదేళ్లుగా గ్రామ పంచాయతీలు చెల్లించాల్సిన గ్రంథాలయ పన్నులు చెల్లించడం లేదని తెలిపారు. బకాయిలు చెల్లిస్తే గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. బకాయిలు చెల్లించాలని కోరారు. వచ్చే ఏడాది మే నెలలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లు, విక్రేతను అరెస్టు చూపిస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి సోమవారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన హుస్సేన్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయించేందుకు తీసుకెళుతుండగా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పంచలోహ విగ్రహ దొంగల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న పంచలోహ విగ్రహాలు, నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ

బనగానపల్లె రూరల్: పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి 30 తులాల వెండి, బంగారం, 11 కిలోల సుబ్రమణ్యేశ్వర పంచలోహ విగ్రహం, 26.5 కిలోల విఘ్నేశ్వరస్వామి పంచలోహ విగ్రహం, రూ.85 వేల నగదు, రెండు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అవుకు ఎస్‌ఐ రాజారెడ్డితో కలిసి నిందితుల అరెస్టు చూపించారు. కొలిమిగుండ్ల మండలం బెలుం గుహల వద్ద నంద్యాలకు చెందిన కొండపల్లి కమల్‌నాథ్, బాలుడిని అరెస్టు చేసి విచారించామని తెలిపారు. చోరీ చేసిన వస్తువులు నంద్యాలలో చాబోలు మంజుల వద్ద ఉన్నట్లు తెలపడంతో ఆమెను అదుపులోకి తీసుకుని వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

డోన్ టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబర్ 3వ తేదీ నుంచి డోన్ డిపో నుంచి ప్రతి ఆదివారం, సోమవారం శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు డోన్ నుంచి బయలుదేరి శ్రీశైలంకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరి డోన్‌కు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.435, పిల్లలకు రూ.250 చార్జీలు వసూలు చేస్తామన్నారు. అదే విధంగా 50 మంది ప్రయాణికులు ఉంటే వారు కోరుకున్న చోటు నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అద్దె ప్రాతిపదికన శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటితో పాటు ఇతర ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అన్వర్ సోమవారం తెలిపారు. ఇటీవల నంద్యాలలో జరిగిన అండర్ 17 ఖోఖోలో రజిత, అండర్ 14 కబడ్డీలో రామ్మోహన్, దినేష్ ప్రతిభ చాటి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా పీఈటీ శివమ్మతో పాటు విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. ఉపాధ్యాయులు చంద్రమౌళి, దివాకర్, అంజినప్ప పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ

డోన్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పశుగణన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డోన్ పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణన కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, లక్కసాగరం లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని భార్యకు ఆర్థిక సాయం చేస్తున్న వెల్డర్లు

డోన్ రూరల్: మండల పరిధిలోని మల్లెంపల్లి గ్రామానికి చెందిన వెల్డర్ మాదన్న మూడు రోజుల క్రితం మృతిచెందాడు. సోమవారం మృతుని కుటుంబానికి డోన్ వెల్డింగ్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.34 వేల ఆర్థిక సాయం చేశారు. మృతుని భార్య సునీతకు నగదు అందజేశారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: నంద్యాలలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో డోన్‌కు చెందిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా శ్రీసుధ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. సోమవారం శ్రీసుధ స్కూల్ విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులను యజమాన్యం అభినందించింది.

కార్తీక ఉత్సవాలకు ఆహ్వానం

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో జరిగే కార్తీక మహోత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ ఈఓ చంద్రుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ అర్చకుడు మహేశ్వర శర్మ, సిబ్బంది ప్రసాద్ ఉన్నారు.


మాజీ ఎమ్మెల్యే కాటసానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ

రోడ్లపై పశువులను వదిలితే గోశాలకు తరలిస్తాం

బనగానపల్లె రూరల్: రోడ్లపై పశువులను వదిలితే గోశాలకు తరలిస్తామని సీఐ మంజునాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని రోడ్లు, కాలనీల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న గోవులను వాటి యజమానులు తీసుకెళ్లాలని తెలిపారు. దీనిపై గ్రామ పంచాయతీ తరఫున 15 రోజులుగా ప్రచారం చేస్తున్నా యజమానులు పట్టించుకోవడం లేదన్నారు. రెండు రోజుల్లో గోవులను తీసుకెళ్లకుంటే గోశాలకు తరలించి, యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడలతో ఆరోగ్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ

డోన్ రూరల్: క్రీడలతో ఆరోగ్యంతో పాటు స్నేహ బంధాలు ఏర్పడుతాయని పట్టణ సీఐ ఇంతియాజ్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో సోమవారం షటిల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సీఐ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్/డోన్ రూరల్: మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు పెండింగ్ వేతనాలు, భద్రతా సౌకర్యాలు, రక్షణ పరికరాలు, పనిముట్లు, యూనిఫాం, చెప్పులు, సబ్బులు సకాలంలో అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, మండల, పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేసి అనంతరం కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో 20 మంది కార్మికులు రోజువారీగా పనిచేస్తున్నారని.. వారికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు.

- డోన్ రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతిచెందిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజాకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. కారుణ్య నియామకాలపై అధికారులు దృష్టి సారించడం లేదని వాపోయారు. ఉద్యోగుల కుటుంబాలను ఇబ్బంది పెడుతున్న డోన్ మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.
- బేతంచెర్ల: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. నగర పంచాయతీ కార్మికులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత


విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని యర్రగుడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి బహుమతులు అందజేశారు. పాఠశాలలలో పనిచేసి రిటైర్డ్ అయిన గణిత ఉపాధ్యాయుడు లక్కిరెడ్డి రాజశేఖరరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రవీంద్రనాథరెడ్డి గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇచ్చిన మెమొంటోతో పాటు నగదు బహుమతులను హెచ్‌ఎం అందజేశారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం దారుణం

డోన్ టౌన్: ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ భారం మోపడం దుర్మార్గమని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, నాయకుడు శివరామ్ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై సోమవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలపై భారం మోపడం దారుమన్నారు. అనంతరం ఆ పార్టీ పట్టణ ఆటో యూనియన్ కార్యదర్శిగా వెంకటేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

డోన్ రూరల్: మండల పరిధిలోని బొంతిరాళ్ల గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేణుగోపాల్(23) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు కృష్ణగిరి మండలం, కోయికొండ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇటీవల వివాహం నిశ్చయమైందని పేర్కొన్నారు.